నర్సరీలపై నిఘా ఏది?

- నియోజకవర్గంలో తగ్గిపోతున్న మొక్కల పెంపకం
- నర్సరీలలో మట్టి సేకరణ, బ్యాగులకు ఖర్చులు అధికం
- ఒక్కో నర్సరీలలో 15 వేలకు పైగా మొక్కలు


ఉండవెల్లిలో ఏర్పాటు చేస్తున్న నర్సరీ

ఉండవెల్లి: గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపుల మొక్కలను నాటించాలన్న నర్సరీలలో మొక్కల పెంపకం పెరగాలని అధికారులకు ఉన్నతాధికారులకు సూచించారు. అనేక రకాల మొక్కలను నాటించి హరితహారంలో భాగంగా మొక్కలను నాటించారు. కొన్ని చోట్ల మొక్కలు లేని సమయంలో ఆంధ్ర వెళ్లి మొక్కలను కొనుగోలు చేసుకుని తెచ్చి నాటారు. అధికారులు విస్తృత స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎలక్షన్ విధుల్లో సిబ్బంది వెళ్లడంతో పట్టించుకోలేదు. కానీ భారం మొత్తం సిబ్బంది మీద పడడంతో సతమతమవుతున్నారు. అధికారులు సమావేశం నిర్వహించినా సిబ్బంది హాజరు కాని పరిస్థితి నెలకొంది. దీంతో ఉన్నతాధికారులకు సమాచారం తెలియడంతో సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది.

మొక్కకంటే, కర్ర, ట్రీ గార్డుల ఖర్చు అధికం..

నర్సరీలలో మొక్కలను పెంచాలంటే ఎర్రమట్టి సేకరణ, బ్యాగులు, బ్యాగులలో నింపడానికి ఉపాధి కూలీలు, తదితర వాటికే రూ.లక్షల్లో ఖర్చు పెడుతున్నారు. వాటికంటే ప్రైవేటులో కొనుగోలు చెయడమే అధికమవుతుందని ప్రజాప్రతినిధులు తెలిపారు. నర్సరీలో మొక్కలు పెరిగాక మొక్కలు నాటడానికి ఉపాధి కూలీలు గుంతలు తీయాలి, మొక్క కోసం కర్రను ఏర్పాటు చేయాలి, రక్షణ కోసం ట్రీ గార్డు ఏర్పాటు చేయాలి. వీటి ఖర్చులు రూ.లక్షల్లో ఉన్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో మొక్కలు నాటించడంతో పాటు, వాటి పెంపకంపై నిఘా మరిచారని ప్రజలు పేర్కొంటున్నారు.

మొక్కలు నాటిన.. వాచర్ల కరువు

ప్రతి రోడ్డులో మొక్కలు నాటి వాటిని పెంచిన వాచర్లు మాత్రం లేరని పేర్కొంటున్నారు. వాచర్లు ఉంటేనే మొక్కలు నాటి వాటి పెంపకం బాగుంటుందని తెలిపారు. నాటిన మొక్కలకు కొన్ని చోట్ల నీరు పోయాక ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది.

వాచర్లను ఏర్పాటు చెయ్యాలి..



మొక్కలు నాటిన వాటికి వాచర్లను ఏర్పాటు చేయకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. ప్రతి గ్రామంలో మొక్కలను నాటించి వాటికి నీరుపోసే వాళ్లు లేక ఎండిపోతున్నాయి.

– వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు

ప్రతి గ్రామంలో పరిశీలిస్తాం..

గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపుల మొక్కలను నాటిన వాటికి ట్రీ గార్డులు, కర్రలు రక్షణగా ఏర్పాటు చేస్తాం. వాటిని కాపాడేందుకు వాచర్లను ఏర్పాటు చేస్తున్నాం. అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. త్వరలో అన్ని చోట్ల ఏర్పాటు చేస్తాం. మొక్కలను కాపాడుకుందాం.

– నాగేంద్రం, అడిషనల్ డీఆర్‌డీఓ, గద్వాల్

క్లుప్తంగా

గ్రామాల్లో అభివృద్ధి పనుల పరిశీలన

మానవపాడు: మండల కేంద్రంలోని నర్సరీని మంగళవారం ఎంపీడీఓ రమణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నర్సరీల్లో సంచులలో త్వరగా మట్టిని నింపే కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు. సంచులలో మట్టిని పూర్తి చేసిన వెంటనే విత్తనాలు వేసి, వాటికి నీటి సాదుపాయని సమకూర్చాలని తెలిపారు. వారి వెంట సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వర్ష ప్రభావంతో రోడ్లన్నీ జలమయం



ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో చిన్నపాటి వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయ్యాయి. మంగళవారం 5 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వర్షం పడడంతో కొన్ని చోట్ల మొక్కజొన్న తడిసిపోయింది.

వర్షానికి తడిసిన మిర్చి



మానవపాడు: మండలంలోని గోకులపాడులో మంగళవారం మిర్చిపంటను రైతు సంజీవ నాయుడు కల్లంలో ఆరవేయగా, వర్షం పడడంతో తడిసిందని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను మిరప పంటను 10 ఎకరాల్లో సాగు చేశానని, ముందు కాయలు కాసి పండు అయిన తర్వాత మిర్చిని కొత కోయగా అకాల వర్షాలతో నష్టాలు తప్పడం లేదని వాపోయాడు.

క్రికెట్ కిట్ల పంపిణీ



అయిజ: తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారుల కోసం మంజూరు చేసిన క్రికెట్, వాలీబాల్ కిట్లు ఎన్నికల కోడ్ ముగియడంతో మంగళవారం మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో యువతకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి వీరేష్ మాట్లాడుతూ యువత క్రీడల్లో పాల్గొని ప్రతిభను పెంచుకునేందుకు ప్రభుత్వం క్రికెట్, వాలీబాల్ కిట్లను పంపిణీ చేసిందని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

మొక్కు చెల్లించుకున్న నాయకులు



గట్టు: గద్వాల ఎమ్మెల్యేగా బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గెలుపొందిన తరుణంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు గాజుల సంతోష్ ఆధ్వర్యంలో గండి ఆంజనేయస్వామి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. గండి ఆంజనేయస్వామి ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు హనుమంతురెడ్డి, రాము నాయుడు, బజారి, కొళాయి భాస్కర్, వీరారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రంగస్వామి, సోంపురం తిమ్మప్ప, నరేష్, భాస్కర్, జయన్న, తిమ్మరాజు, భీమన్న పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా..

గట్టు: బియ్యం లోడుతో కర్ణాటకలోని జిలంగేరికి వెళ్తున్న ట్రాక్టర్ గట్టు–మాచర్ల గ్రామాల మధ్యనున్న గట్టు చెరువు అలుగు కల్వర్టు వద్ద మంగళవారం రాత్రి అదుపు తప్ప బోల్తా పడింది. ట్రాక్టర్‌పై ఉన్న నలుగురు వ్యక్తులు తృటిలో ప్రాణాపాయం నుంచి బయట పడ్డారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. తెలంగాణ సరిహద్దులోని కర్ణాటక ప్రాంతం జిలంగేరికి చెందిన రైతులు గట్టులో వడ్లను బియ్యంగా మార్చుకుని తిరిగి స్వగ్రామానికి ట్రాక్టర్‌లో వెళ్తున్న సమయంలో ఇలా సంభవించింది.

అభినవ గాంధీ నెల్సన్ మండేలా

వనపర్తి టౌన్: జాతి వివక్షతకు గురవుతున్న నల్ల జాతీయులకు విముక్తి కల్పించిన అభినవ గాంధీ నెల్సన్ మండేలా అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మంగళవారం టీజేఏసీ ఆధ్వర్యంలో నెల్సన్ మండేలా 11వ వర్ధంతిని నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం


ఎమ్మెల్యే బండ్లను సన్మానిస్తున్న నాయకులు

గద్వాల రూరల్: రెండోసారి కూడా ఎమ్మెల్యేగా గెలుపొందిన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, పార్టీ కౌన్సిలర్లు ఉన్నారు.

ఉత్సాహంగా సందెపురాళ్ల పోటీలు


సందెపురాళ్ల పోటీని తిలకిస్తున్న ప్రజలు



గట్టు: మండల కేంద్రంలో భవానీ మాత జాతర సందర్భంగా మంగళవారం సందెపురాళ్ల పోటీలను నిర్వహించారు. సందేరాళ్ల పోటీల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన ఔత్సాహికులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. భవానీ ఆలయం ముందు భాగంలో సందెపురాళ్ల పోటీలను ఏర్పాటు చేశారు. పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వారు పెద్ద ఎత్తున తరలి రావడంతో జాతర ప్రాంగణం జనాలుతో కిక్కిరిసి పోయింది. కర్ణాటక ప్రాంతానికి చెందిన వారు కూడా పోటీల్లో పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

మండల కేంద్రంలో జాతర సందర్భంగా నిర్వహించిన సందెపురాళ్ల పోటీల విజేతలకు మంగళవారం రాత్రి బహుమతులను అందజేశారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతర సందర్భంగా సందెపురాళ్ల పోటీలను నిర్వహించారు. పోటీలో 111 కేజీల చేతి రాయిని ఎత్తి మొదటి విజేతకు దాత మోహన్‌గౌడు సమకూర్చిన రూ.1,0016లను నాగందొడ్డికి చెందిన బోయ ప్రతాప్ దక్కించుకున్నారు. కుక్కనూర్‌కు చెందిన అంపయ్య 106 కేజీల చేతిరాయిని ఎత్తడంతో ద్వితీయ బహుమతిని దాత బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి రూ.8,016 అందజేశారు. 106 కేజీల చేతి రాయిని మూలమల్లకు చెందిన రాముడు ఎత్తడంతో తృతీయ బహుమతి దాత గాజుల సంతోష్ సమకూర్చిన రూ.6016లు అందజేశారు. 100కేజీల చేతి రాయిని మిట్టదొడ్డికి చెందిన ఉరుకుందు ఎత్తడంతో నాలుగో బహుమతిని దాత గట్టు–1 ఎంపీటీసీ సరాబ్బాయి మహేశ్వరి రూ.4016లు అందజేశారు. ఐదో బహుమతి దాత జీ.కృష్ణ సమకూర్చడంతో రూ.3016లను విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు హనుమంతురెడ్డి, రామునాయుడు, బజారి, గాజుల సంతోష్, వీరారెడ్డి, భాస్కర్, రంగస్వామి, నరేష్, మింత్రి లక్ష్మన్న, మధు, అంజి, వీరన్న, చెన్నప్ప, తిమ్మప్ప, నవీన్‌చారి, భీమేష్, తిమ్మప్ప పాల్గొన్నారు.

జాతరలో భక్తుల సందడి




మండల కేంద్రంలో నిర్వహిస్తున్న శ్రీ అంబా భవానీ మాత జాతర ప్రజలతో సందడి నెలకొంది. మంగళవారం భవానీ మాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. జాతర సందర్భంగా సంతబజారులో వివిధ రకాల దుకాణాలు వెలిశాయి. పిల్లలు ఆడుకునే ఆట వస్తువుల విక్రయ దుకాణాలు, గాజుల దుకాణాలు, గృహ అవసరాలకు ఉపయోగించే పనిముట్ల దుకాణాలతో పాటు పిల్లలు, పెద్దలు ఆడుకునే ఆటలకు సంబంధించిన వాటిని జాతరలో ఏర్పాటు చేశారు. గట్టుకు చెందిన వారితో పాటుగా చుట్టు పక్కల గ్రామాల వారు జాతరకు తరలి వస్తుండడంతో మండల కేంద్రంలో ప్రజలతో కిటకిటలాడుతోంది.

తృటిలో తప్పిన ప్రాణాపాయం



గట్టు: మండల కేంద్రంలో జాతరకు బతుకు దెరువు కోసం వచ్చిన ముగ్గురు మహిళలు మంగళవారం ఉదయం తృటిలో ప్రాణాపాయం నుంచి బయట పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. జాతరకు రంగుల రాట్నం వెంట వచ్చిన ముగ్గురు మహిళలు రోహినా, సత్యవతి, బేగం ఉదయం స్నానం చేసేందుకు గట్టు చెరువులోని కొత్తగా తవ్విన బావి దగ్గరకు వెళ్లారు. స్నానం చేస్తున్న క్రమంలో విజయవాడకు చెందిన రోహినా నీటి గుంతలోకి దిగింది. నీటి గుంత కాస్త లోతుగా ఉండడంతో రోహినా గుంతలోకి జారి పోతున్న క్రమంలో ఆమెను కాపాడేందుకు మరో మహిళ సత్యవతి ప్రయత్నించింది. ఆమె కూడా నీటి గుంతలోకి జారీ పోయింది. వీరిద్దరిని కాపాడేందుకు బేగం ప్రయత్నించగా ఆమె కూడా నీటి గుంతలోకి జారుకుంది. ఇలా ముగ్గురు లోతుగా ఉన్న నీటి గుంత నుంచి బయటకు వచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. ఆ సమయంలో అటువైపు వెళ్తున్న ఓ వ్యక్తి వారిని గమనించి, ఒడ్డున ఉన్న చీరను నీటిలో ఉన్న మహిళలకు అందించి వారిని గడ్డకు చేర్చారు. ఈ విషయాన్ని గమనించి, మహిళలను సురక్షితంగా నీటి గుంత నుంచి బయటకు తీశారు. ఏ మాత్రం ఆలస్యమైనా ముగ్గురు మహిళల ప్రాణాలు నీటిలో కలిసి పోయేవని స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న కానిస్టేబుళ్ల దివాకర్, తాహేర్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని మహిళల వివరాలను తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పచెప్పారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



మానవపాడు: మానవపాడు–అమరవాయి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి కల్వర్టుల వద్ద వాగులో విద్యుత్ స్తంభం ఒరిగిపోయి, విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందకు ఒరిగి ఉన్నాయి. ప్రధాన రోడ్డుపై పెద్దవాగు వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంది. విద్యుత్‌స్తంభాలు నేలకు ఒరిగి ప్రమాదకంరగా ఉన్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు


గద్వాలలో కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు

ధరూరు: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సీఎల్పీనేతగా, ముఖ్యమంత్రిగా ప్రకటించడంతో మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. మంగళవారం రాత్రి మండలంలోని వైఎస్సార్ చౌరస్తాలో బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో బండ్ల వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజారెడ్డి, బండ్ల వెంకటేశ్వరరెడ్డి, కర్రెన్న, కుర్వ శ్రీను, సవారన్న, దేవన్న, రామిరెడ్డి, డిష్ వెంకటేశ్వర్‌రెడ్డి, నత్తి వెంకటన్న, షాకీర్, ప్రభాకర్, నాగన్న, దావీదు, సీఎం నర్సింహులు, గోవిందు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


ధరూరులో మిఠాయి తినిపిస్తున్న యువకులు


ధరూర్‌లో బాణాసంచా కాల్చుతున్న కాంగ్రెస్ నాయకులు

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు


కరాటేలో విజయం సాధించిన విద్యార్థులు, పాఠశాల ఎస్ఓ అనురాధ

మానవపాడు: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు కరాటేలో సత్తా చాటారు. సోమవారం నిర్వహించిన సౌత్ ఇండియా చాంపియన్ షిప్ మోయర్ కప్ 2023కు సంబంధించి మానవపాడు కేజీబీవీ పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులు పాల్గొన్నారని కేజీబీవీ ఎస్ఓ అనురాధ మంగళవారం తెలిపారు. రాము కరాటే మాస్టర్ ఆధ్వర్యంలో 15 మంది విద్యార్థులు కరాటే పోటీల్లో పాల్గొని, కాటా విభాగంలో ముగ్గురుకి గోల్డ్ మెడల్ అక్షత, ఈరమ్మ, సంధ్యకి వచ్చాయని, 7మందికి సిల్వర్, 5మందికి బ్రోన్జ్ లభించిందని తెలిపారు. పాఠశాల పీటీ ఉపాధ్యాయురాలు అమృతరాణి విద్యార్థులు పోటీలో విజయం సాధించే విధంగా కృషి చేశారన్నారు. అనంతరం విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. ప్రతి ఒక్కరూ భవిష్యత్‌లో క్రీడా రంగంలో గానీ, చదువులోగానీ ఉన్నత లక్ష్యాలను ఏర్పచుకొని విజయం సాధించాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మృత్తిక దినోత్సవం


చాగాపురంలో అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మృత్తిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాగాపురంలో ఏఈఓ భరత్ ఆధ్వర్యంలో రైతులతో గ్రామంలోని పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించి నేల ఆవశ్యకతపై రైతులకు, ప్రజలకు వివరించారు. అనంతరం రైతు వేదికలో పుడమితల్లిని రక్షించడం, నేల ఉత్పాదక శక్తిని పెంచడం, నేలను సారవంతం చేయడం, కలుషితం లేని నేలను తయారు చేయడం కోసం రైతులు చేపట్టవలసిన వివిధ రకాల వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్


ధరూరులోని ఎస్సీ కాలనీలో లీకైన మిషన్ భగీరథ పైప్‌లైన్

ధరూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ తాగు నీటి పైప్‌లైన్ లీక్ అయ్యింది. రాయచూరు రోడ్డు నుంచి శ్మశాన వాటిక మీదుగా ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డులో చిన్న గుడ్డెన్న గారి కిష్టన్న ఇంటి ముందు పైప్ లైన్ లీక్ అయి వారం రోజులైనా గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా తాగేనీరు కావడంతో కలుషితమయ్యే ప్రమాదం ఉందని సంబంధిత శాఖ అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీని సరి చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

రోడ్లకు మరమ్మతు చేయండి


గుంతలు పడి ప్రమాదాలకు కారణమవుతున్న రాయచూర్-కర్నూల్ రోడ్డు

అయిజ: రెండు రాష్ట్రాలను కలిపే రాయచూర్–కర్నూలు రహదారి శిథిలమై సంవత్సరాలు గడిచినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో తరుచూ ప్రమాదాలు ఏర్పడుతున్నాయి. అయిజ నుంచి వెంకటాపురం మధ్యనున్న బీటీ రోడ్డు మోకాళ్ల లోతు గుంతలు పడి ప్రయాణం నరకయాతనగా మారింది. కనీసం రోడ్డుపై తట్టమన్ను వేసేందుకు కూడా నోచుకోవడంలేదని, వర్షాకాలంలో గుంతల్లో మురుగునీరు చేరి అక్కడ గుంతలున్నట్లు కూడా తెలియకపోవడంతో వేగంగా వస్తున్న వాహనాలు గుంతల్లోపడి ప్రమాదాలు జరిగుతున్నాయని, తరుచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా రోడ్డుకు మరమ్మతు దచేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పక్కన పొంచి ఉన్న ప్రమాదం


మానవపాడులో రోడ్డు పక్కనే బావి, విత్యుత్ స్తంభాలు

మానవపాడు: రోడ్డు పక్కనే బావి, విద్యుత్ స్తంభాలు ఉండడంతో ఎప్పుడు ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ కొద్దిగా ముందుకు మానవపాడు నుంచి అమరవాయి గ్రామాలకు నిత్యం ప్రజలు ప్రయాణం సాగిస్తుంటారు. ఈ రోడ్డు గుండానే అమరవాయి, పెద్దఆముదాలపాడు, నారాయణపురం, కలుకుంట్ల, మద్దూరు, ఏ బుద్దిపాడు, శాంతినగర్, చంద్రశేఖర్‌నగర్, కొర్విపాడు గ్రామాలకు వెళ్లే రోడ్డు నిత్యం వేల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభాలతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. బీటీరోడ్డు కావడంతో వాహనదారులు రోడ్డుపై దూసుకుపోతున్నారు. అదుపు తప్పితే ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ స్తంభాలను, బావులకు రక్షణ గోడలను ఏర్పాటు చేయాలని వాహనాదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా రోడ్డు

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో గద్వాల–రాయచూర్ వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. మార్గ మధ్యలో రహదారి కొంతమేర కోతకు గురైంది. దీంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అసలే రోడ్డు విస్తీర్ణం చిన్నగా ఉందని, ఒక వైపు నుంచి వాహనాలు వస్తే మరో వైపు నుంచి వెళ్లడానికి ఇబ్బందిగా ఉంటుందని పేర్కొన్నారు. అలాంటి రోడ్డు ఇలా కోతకు గురైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చే యించాలని కోరుతున్నారు.